క్లుప్తంగా

రేపు ‘ప్రజావేదిక’ సామాజిక తనిఖీ

తిరుమలాయపాలెం: ఈ నెల 7న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై గ్రామాల్లో నిర్వహించిన సామాజిక తనిఖీ వివరాలను తిరుమలాయపాలెం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక ద్వారా వివరించనున్నట్లు మండల ఎంపీడీఓ శ్రీనివాసరావు సోమవారంఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించే ప్రజావేదికలో ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు సకాలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

9న జైలులోని పాత ఇనుము వేలం

ఖమ్మంరూరల్ : డైరెక్టర్ జనరల్ ఆఫ్ ప్రిజన్స్ హైదరాబాద్ ఉత్తర్వుల మేరకు జిల్లా జైలులో గల పాత ఇనుప సామాను, ఇత్తడి, స్టీల్, వాడకంలో లేని ఓమ్ని వాహనాన్ని ఈనెల 9న ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జైలు ఆవరణలో వేలం వేయనున్నట్లు జైలు సూపరింటెండెంట్ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ. 5వేలు ధరావత్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని, వేలం అనంతరం ధరావత్ తిరిగి చెల్లిస్తామని తెలిపారు. వస్తువులను దక్కించుకున్న వారు 18శాతం జీఎస్టీతో పాటు మొత్తం పాడిన సొమ్ము వెంటనే చెల్లించి తీసుకెళ్లవచ్చని పేర్కొన్నారు.

16న జరిగే సమ్మెను జయప్రదం చేయండి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్ అన్నారు. సోమవారం నగరంలో సంఘం ఆధ్వర్యాన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం పదేళ్ల కాలంలో ప్రభుత్వ రంగ సంస్థల ఆస్తులను ధ్వంసం చేస్తూ కార్పొరేట్లకు అమ్మేస్తుందని, ప్రైవేటీకరణ విధానాలను మరింతగా పెంపొందించిందని అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో లక్షలాది ఖాళీ ఉద్యోగాలను భర్తీ చేయకుండా నిరుద్యోగులను పెంచుతుందని పేర్కొన్నారు. 16న జరిగే గ్రామీణ బంద్, దేశ వ్యాప్త సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి ఐ.వెంకన్న, ఎస్‌కె.సుభాహన్, బోడా నాగేశ్వర రావు, గుగులోత్ పటేల్, జి.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

నేలకొండపల్లి: మండలంలోని సుర్దేపల్లి గ్రామానికి చెందిన పచ్చిపాల జయమ్మకు రూ.2 లక్షల బీమా చెక్కును సోమవారం బ్యాంక్ మేనేజర్ శశాంక్ అందించారు. నేలకొండపల్లి ఏపీజీవీబీ బ్రాంచ్ పరిధిలో సుర్దేపల్లి గ్రామానికి చెందిన సత్యం ప్రధాన మంత్రి జీవన జ్యోతి ఇన్సూరెన్స్ పథకంలో చేరడం ద్వారా మంజూరైన నగదును ఆయన సతీమణి జయమ్మకు అందించారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ ఆర్.ఉపేంద్రబాబు, అకౌంటెంట్ కొమరయ్య, క్యాషియర్ వీరేశ్, వై.శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	గుంటూరు కారం
వినోద	అంబాజీపేట మ్యారేజి బ్యాండ్
సాయిరాం	నాసామిరంగ
ఆదిత్య	బూట్‌కట్ బాలరాజు
శ్రీనివాస	కిస్మత్
సుందర్	హనుమాన్

\- ఖమ్మంగాంధీచౌక్

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	30	బచ్చలికూర	3
వంకాయ	20		20
బెండకాయ	50	పాలకూర	3
పచ్చిమిర్చి	36		20
కాకర	66	చుక్కకూర	3
బీర	50		20
దొండ	44	తోటకూర	2
పొట్లకాయ	40		10
చిక్కుడు	110	గోంగూర	2
గోరుచిక్కుడు	56		10
క్యాబేజీ	24	మెంతికూర	3
క్యాలీఫ్లవర్	36		20
ఆలుగడ్డ	28	కొత్తిమీర	1
చామగడ్డ	56		30
క్యారెట్	40	పుదీన	1
క్యాప్సికం	56		20

\-ఖమ్మం వ్యవసాయం

కార్యమేదైనా..



ఫ్లెక్సీలు పెట్టాల్సిందే..!

- పెరుగుతున్న ఫ్లెక్సీ కల్చర్..
- బ్యానర్ లేనిదే ముందుకు సాగని కార్యాలు
- నగరాన్ని నింపేస్తున్న పార్టీలు
- విపరీత వాడకంతో అనేక అనర్థాలు
- క్లాత్ బ్యానర్లే ముద్దంటున్న పర్యావరణవేత్తలు

ఖమ్మంవన్‌టౌన్: అది శుభకార్యమైనా.. అశుభ కార్యమైనా ఫ్లెక్సీ మాత్రం తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సిందే. రాజకీయ నాయకులు సాధారణ పర్యటనకు వచ్చినా.. పదవీతో తిరిగి వచ్చినా తమ అభిమానులు ఫ్లెక్సీలు ఇరగదీయ్యాల్సిందే. ఏ ఫంక్షన్ అయినా.. ఏ కుల సంఘాల కార్తీకమాస వనసమారాధనలైనా.. ముందుగా ఫ్లెక్సీలే రహదారుల వెంట కుప్పలుకుప్పలుగా దర్శనమిస్తున్నాయి. దీంతో నగరంలో ఏ హోర్డింగ్‌లు చూసినా కొత్త కొత్తగా రంగురంగుల ఫ్లెక్సీలతో నిత్యం దర్శనమిస్తున్నాయి. గత ప్రభుత్వంలో కొన్నిరోజులు ఈ ఫ్లెక్సీలకు విరామం ఇచ్చినా.. తదనంతరకాలంలో వారు సైతం యథేచ్ఛగా వాడి పర్యావరణానికి పెద్ద మొత్తంలో హానిచేస్తూ వచ్చారు. ఇప్పుడు అధికార పార్టీతో పాటు బీఆర్‌ఎస్, అన్నీ పార్టీల కార్యకర్తలు ఫ్లెక్సీలు పెడుతున్నారు.

పల్లెల వరకూ పాకిన సంస్కృతి..

చావైనా, శుభకార్యమైనా, జన్మదినమైనా ఫ్లెక్సీలు పలు సెంటర్లలో కట్టాల్సిందే. గతంలో ఈ కల్చర్ లేదు కానీ కొత్తగా ఈ కల్చర్ ఖమ్మం నగరంతో పాటు అన్నీ గ్రామాల్లో ఈ ఫ్లెక్సీల సంస్కృతి పాకింది. అసలు ఫ్లెక్సీ లేకుండా ఏ కార్యం ముందుకుసాగనంతలా కల్చర్ పెరిగిపోయింది. దీంతో పర్యావరణ కాలుష్యం అంతకంతకూ పెరిగి వాతావరణంలో పెనుమార్పులు సంభవిస్తున్నాయి.

ఇష్టారీతిన ఫ్లెక్సీల వాడకం..

ఖమ్మం నగరంలో ఆ పార్టీ, ఈ పార్టీ అని తేడా లేకుండా ఏ రాజకీయ పార్టీనైనా ఒక్కలాగే వ్యవహరిస్తున్నాయి. ఎన్నికలకు ముందు, ఎన్నికల రిజల్ట్ వచ్చాక, రాజకీయ నాయకులు పదవులు వచ్చాక, ప్రమాణస్వీకారాలకు ఇలా ఒక్కటి కాదు.. రెండు కాదు ప్రతిదానికి ఫ్లెక్సీలనే వాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ఫ్లెక్సీలను ఫ్లెక్సీలు కట్టొద్దని చెప్పి ఒకటి రెండు చోట్ల జరిమానాలు కూడా విధించారు. కొంతకాలం తర్వాత అది మరచి విపరీతంగా ఫ్లెక్సీలు వాడకం మొదలుపెట్టారు. నూతనంగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వ నాయకులు సైతం ఇష్టారీతిన ఫ్లెక్సీలు పెడుతున్నారు.

కానరాని క్లాత్ బ్యానర్లు..

గతంలో ఏ పార్టీ కార్యక్రమం జరిగినా క్లాత్ బ్యానర్లను వాడేవారు. ఎప్పుడైతే ఈ ఫ్లెక్సీలు వచ్చాయో.. గుడ్డ బ్యానర్లను కట్టేవారే కరువయ్యారు. ఈ గుడ్డ బ్యానర్ ద్వారా అటు క్లాత్ తయారు చేసేవారికి, ఆర్టిస్టులకు అనేక మందికి ఉపాధి దొరికేది. సాంకేతికతతో ఫ్లెక్సీల తయారీ మిషన్లు రావడంతో వారు అనివార్యంగా ప్రత్యామ్నాయ రంగాల్లోకి వెళ్లాల్సివస్తుంది.

అధికారులు దృష్టి సారించాలి..



ఫ్లెక్సీల వాడకం నగరంలో విపరీతంగా పెరిగిపోయింది. అన్నీ పార్టీల వారు విచ్చలవిడిగా ఫ్లెక్సీలను కడుతూ పర్యావరణానికి తీవ్రమైన హాని కలిగిస్తున్నారు. నగరంలో ఫ్లెక్సీలను నగరపాలక సంస్థ కమిషనర్ నిషేధించాలి. ఫ్లెక్సీలను ఏర్పాటు చేసే వారిపై కఠినంగా వ్యవహరించి, పెద్ద ఎత్తున జరిమానాలు విధిస్తే భవిష్యత్‌లో ఫ్లెక్సీల వాడకాన్ని తగ్గించవచ్చు.

– వై.విక్రం, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు

కేఎంసీలో డీఈఈలకు డివిజన్లు కేటాయింపు

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి డివిజన్లను డీఈఈ, ఏఈఈలకు కేటాయిస్తూ కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి ఉత్తర్వులు జారీ చేశారు. 1 నుంచి 11, 53 నుంచి 60 డివిజన్ల వరకు అన్ని సివిల్ పనులను పర్యవేక్షించే బాధ్యత డీఈఈ టి.ధరణికుమార్‌కు అప్పగించారు. వీటితో పాటు దానవాయిగూడెం హెడ్ వాటర్ పనులు, అమృత్ అండ్ పేజల్ రిపోర్ట్స్, లకారం ఫిల్టర్ బెడ్, ట్యాప్ కనెక్షన్లకు సంబంధించి పనులను పర్యవేక్షించనున్నారు. అసిస్టెంట్ ఇంజనీర్‌గా ఎస్.కుమార్‌ను కేటాయించారు. 12 నుంచి 25 డివిజన్‌ల సివిల్ పనులతో పాటు ఆర్‌టీఐ రిపోర్ట్స్, మిని లకారం ట్యాంక్, మెయిన్ లకారం ట్యాంక్ బండ్, ఆఫీస్ వాహనాల బిల్లులకు సంబంధించిన పనులను డీఈఈ టి.శ్రీనివాసులకు కేటాయించారు. అసిస్టెంట్ ఇంజనీర్‌గా టి.సతీశ్‌ను కేటాయించారు. 26 నుంచి 29వ డివిజన్లు, 41 నుంచి 43, 49 నుంచి 52 డివిజన్లను డీఈఈ మాధవికి కేటాయించారు. అలాగే మాధవికి 30 నుంచి 33, 44 నుంచి 48 డివిజన్లు కేటాయించగా అన్ని డివిజన్లలో వాక్ వేస్, జంక్షన్లు, ఓపెన్‌జిమ్‌ల పర్యవేక్షణ అప్పగించారు. ఈ డివిజన్లకు అసిస్టెంట్ ఇంజనీర్‌గా శ్యామ్ మనోహర్‌ను కేటాయించారు. అదేవిధంగా అసిస్టెంట్ ఇంజనీర్‌గా టి.నవ్యజ్యోతిని నియమించి 34 నుంచి 40 డివిజన్లు, వీధి దీపాలు, హెచ్‌టీ, ఎల్‌టీ బిల్లులను అప్పగించారు. అసిస్టెంట్ ఇంజనీర్‌గా జి.శోభన్‌బాబును నియమించారు. అంతేకాక అగ్రిమెంట్స్, క్యాష్ బుక్ రైటర్, పేమెంట్, రిజిస్టర్లు, డీబీ సెక్షన్ కరస్పాండెన్స్, ట్యాప్ కనెక్షన్ల ఫైల్, ఆర్‌టీఐ సమస్యలు, ఎంబీ రిజిస్ట్రర్‌కు సంబంధించిన విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా పి.లోకేశ్‌ను కేటాయించారు. జి.వెంకటేశ్వర్లుకు టెండర్లకు సంబంధించిన పనులు అప్పగిస్తూ కమిషనర్ నిర్ణయించారు.

ఫిర్యాదులు స్వీకరించిన కమిషనర్



ఫిర్యాదు స్వీకరిస్తున్న కమిషనర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగర పాలక సంస్థలో సోమవారం ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌లో నగర ప్రజల నుంచి కమిషనర్ ఆదర్శ్ సురభి ఫిర్యాదులు స్వీకరించారు. వివిధ సమస్యలపై 23 ఫిర్యాదులు అందగా.. వాటిని పరిష్కరించాలని ఆయా విభాగాల అధికారులను కమిషనర్ ఆదేశించారు. గతంలో వచ్చిన ఫిర్యాదుల సమస్యలు పరిష్కారం అయ్యాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను ఏమాత్రం ఆలస్యం చేయకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

స్టాక్‌లో తేడాలుంటే చర్యలు తప్పవు



పెండిప్రోలులో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న ఏడీఏ

తిరుమలాయపాలెం: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ఎరువుల దుకాణాలను కూసుమంచి ఏడీఏ విజయచంద్ర, మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీలర్ల వద్ద బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్లు, పీఓఎస్ మిషన్లను తనిఖీ చేశారు. ప్రతీ డీలర్ యూరియా, డీఏపీ మందులను పీఓఎస్ మిషన్ ద్వారా ఆన్‌లైన్ చేసి అమ్మాలని.. అవి బిల్ పుస్తకాలు, స్టాక్ రిజిస్టర్, గ్రౌండ్ బ్యాలన్స్‌కు సరిపడా ఉండాలని ఆదేశించారు. స్టాక్‌లో తేడాలు ఉంటే సంబంధిత డీలర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలోని ఎరువుల కొరత లేదని, యూరియా సరిపడా ఉందని తెలిపారు. సహకార కేంద్రాల్లో రైతులు యూరియా కొనుగోలు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎండగడదాం



సమావేశంలో మాట్లాడుతున్న యూసఫ్

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 16న జరుగుతున్న దేశవ్యాప్త పారిశ్రామిక సమ్మె, గ్రామీణ బంద్ కార్యక్రమంతో కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలని అఖిలపక్ష కార్మిక సంఘ నాయకులు కార్మిక లోకానికి పిలుపునిచ్చారు. మంచికంటి భవన్‌లో జరిగిన ఖమ్మం జిల్లా అఖిలపక్ష కార్మిక సంఘాల సదస్సులో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు ఎండీ.యూసఫ్, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.జలీల్‌ఖాన్, సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణం వెంకటేశ్వర్లు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.సూర్యం, బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి పాలవంచ కృష్ణ, ఇఫ్టూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.జనార్దన్‌లు హాజరై ప్రసంగించారు. పదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం రైతాంగ, కార్మికవర్గ, ప్రజల సమస్యలను పరిష్కరించలేదన్నారు. అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారని, కార్మిక వర్గాలకు ఉపాధిని దూరం చేస్తున్నారని అన్నారు. 16న జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గాదె లక్ష్మీనారాయణ, ఐఎన్‌టీయూసీ జిల్లా నాయకుడు నరేష్‌నాయుడు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మా విష్ణు, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటరెడ్డి, బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు ఎండీ.వై పాషా, ఇఫ్టూ జిల్లా కార్యదర్శి వెంకన్న, ఆయా సంఘాల నాయకులు సింగు నరసింహారావు, బీ.జీ.క్లెమెంట్, తోట రామాంజనేయులు, శివరామకృష్ణ, నిమ్మటూరి రామకృష్ణ, విప్లవకుమార్, సూరిబాబు, జయరాజు, రమ్య, జిల్లా ఉపేందర్, శీలం నరసింహారావు, తిరుమలాచారి, సర్వేశ్వరరావు, జి.రామయ్య, కె.శ్రీనివాస్, గోస్ పుల్లయ్య, ఎస్‌కె.సుభాని, బోడ నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దైవభీతితోనే సమస్యల పరిష్కారం

ఖమ్మం మామిళ్లగూడెం: దైవభీతితోనే సమస్యల పరిష్కారం అవుతాయని జమాతె ఇస్లామీహింద్ తెలంగాణ లీగల్ అఫైర్స్ కార్యదర్శి ఎండీ.ఇల్యాస్ అన్నారు. సోమవారం ఖమ్మం అజీజ్‌గల్లీలో ఖిల్లా శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమాజంలో చెడు శరవేగంతో పెరుగుతుంటే రూపుమాపే ప్రయత్నం చేయకుండా తనకు తాను దైవద్యాసలో నిమగ్నమైపోయే వాడు నిజ విశ్వాసి కాదన్నారు. ఈ సమావేశంలో ఖిల్లా డివిజన్ అధ్యక్షుడు మలిక్, మాజీ అధ్యక్షుడు ఖలీల్ అహ్మద్‌ఖాన్, సభ్యులు రాఫే, ఇలియాస్, రజాక్, గౌస్, ఫయాజ్, మల్లిక్, రఫీ, ఖాసిం, నాసర్, గఫ్పార్, సమినా, అన్జుమ్, సైదాబాను, గౌసియా,తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్లు అందజేత



దుప్పట్లు అందజేస్తున్న సంస్థ బాధ్యులు

కూసుమంచి: మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఖమ్మంలోని గ్రేస్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన దుప్పట్లు, గిఫ్ట్ ప్యాక్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ బాధ్యులు ఆదినారాయణ మాట్లాడుతూ.. తల్లిదండ్రులను కోల్పోయిన విద్యార్థులకు ఉచిత భోజన వసతితో విద్యను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆర్. వెంకటరెడ్డి, ఎస్‌ఎంసీ మాజీ చైర్మన్ రాందాసు, పంచాయతీ కార్యదర్శి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై దృష్టి సారించాలి



మాట్లాడుతున్న డీఈఓ సోమశేఖర్‌శర్మ

ఖమ్మంఅర్బన్: పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఈఓ సోమశేఖర్‌శర్మ పేర్కొన్నారు. సోమవారం ఖమ్మంఅర్బన్ ఎంఈఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంల సమావేశంలో ఆయన మాట్లాడారు. వెనుకబడిన విద్యార్థుల కోసం సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని హెచ్‌ఎంలకు సూచించారు. ఈ సమావేశంలో ఖమ్మంఅర్బన్ ఎంఈఓ ఎం.శ్రీనివాస్, శైలజలక్ష్మి, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

మహిళ ఆచూకీ లభ్యం

కామేపల్లి: పింజరమడుగు గ్రామంలో కుటుంబ కలహాల నేపథ్యాన అదృశ్యమైన వివాహిత ఆచూకీ సోమవారం లభ్యమైనట్లు ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆమెను తిరుపతి రైల్వేస్టేషన్ పోలీసులు గుర్తించి, కామేపల్లి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆమెను అక్కడి నుంచి తీసుకొచ్చి కుటుంబసభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి



ఖమ్మంమామిళ్లగూడెం: క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మం మామిళ్లగూడెం: గ్రామాల్లో నిత్యం పేద ప్రజలకు అందుబాటులో ఉంటూ విధులు నిర్వహిస్తున్న గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారం తన బాధ్యత అని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో సోమవారం తెలంగాణ మైనార్టీ గ్రామీణ వైద్యుల సంఘం 10వ మహాసభలో మంత్రి పాల్గొని నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. జిల్లా అధ్యక్షుడు షేక్.హాసన్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి షేక్.జానిమియా, జిల్లా గౌరవ అధ్యక్షుడు షేక్.హాసన్, వ్యవస్థాపకుడు ఎస్‌కె.నజీరుద్దీన్, నాయకులు బాబుసాహెబ్, ఖాసిం, చాంద్‌పాషా, అహ్మద్‌పాషావలీ, షాజహాన్, నబీ, మాన్సూర్ అలీ, మహిమూద్, బాజీ, రబ్బాని, ఈశాక్, ఆశ, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక..

రఘునాథపాలెం: మండలంలోని చింతగుర్తి గ్రామానికి చెందిన 30 కుటుంబాలు సోమవారం రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. మాజీ సర్పంచ్ తమ్మిని నాగేశ్వరరావు, ఎంపీటీసీ మాలోత్ లక్ష్మి ఆధ్వర్యాన పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి తుమ్మల స్వాగతించారు. పార్టీలో చేరిన వారిలో కేతినేని సీతారామయ్య, హనుమంతురావు, గోర్ల వెంకన్న, బానోత్ సాయి కృష్ణ, ఉపేందర్, లక్ష్మీనారాయణ, ప్రసాద్, శ్రీను, నాగేశ్వరరావు, సైదులు, శివ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఆర్ విద్యార్థులకు అభినందన..

ఖమ్మం సహకారనగర్: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో సత్తా చాటిన ఖమ్మం ఎస్‌ఆర్ విద్యార్థులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అభినందించారు. సోమవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిసిన ఎస్‌ఆర్ విద్యాసంస్థల బాధ్యులు, విద్యార్థులకు పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చిన త్రిపుర, త్రినయ, సుహాసినిలు బంగారు వెండి పతకాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ హెడ్ విజయ భాస్కర్, హెచ్‌ఎం మూర్తి, పవన్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు చిత్తవుతున్న యువతను కాపాడండి



సీపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: గంజాయికి బానిసలవుతూ మత్తుకు చిత్తవుతున్న యువతపై దృష్టి సారించాలని కోరుతూ ఏఐఎస్‌ఎఫ్ నాయకులు సోమవారం సీపీ సునీల్‌దత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ మాట్లాడుతూ.. విద్యాలయాలను అడ్డాగా చేసుకొని విక్రయదారులు విద్యార్థులు, యువకుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కొందరికి మత్తు పదార్థాలు అలవాటు చేస్తుంటే.. మరికొందరిని మత్తు పదార్థాల రవాణాకు ఉపయోగిస్తున్నారని పేర్కొన్నారు. దీనిపై దృష్టి సారించి విద్యార్థులు, యువత జీవితాలు బలికాకుండా కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు మడుపల్లి లక్ష్మణ్, ఉపాధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా, చందూలాల్, నిఖిల్, ప్రతాప్, రాజు, నగేశ్, గోపి తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన సేవలు అందించాలి

కామేపల్లి: వాహనదారులకు నాణ్యమైన పెట్రోలు అందించి ప్రజల మన్ననలు పొందాలని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. సోమవారం మండలపరిధిలోని జోగ్గూడెం గ్రామ సమీపంలోని నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు నాగేశ్వరరావు, డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్, ఏపూరి మహేందర్, గింజల నర్సింహారెడ్డి, నల్లమోతు లక్ష్మయ్య, భట్టు శంకర్ బొడ్డు లక్ష్మీనారాయణ, పత్తే మహ్మద్, బానోత్ నరసింహనాయక్, మేకపోతుల మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వలస కూలీపై లైంగిక దాడి

రఘునాథపాలెం: పొట్ట కూటి కోసం ఇతర రాష్ట్రం నుంచి వచ్చి కూలీ పనులు చేసుకుంటున్న కూలీపై తోటి కూలీలే లైంగిక దాడికి పాల్పడ్డారు. సోమవారం రఘునాథపాలెంలో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలను స్థానిక సీఐ శ్రీహరి ఇలా తెలిపారు. రఘునాథపాలెంలో కొందరు వలస కూలీలు నివసిస్తున్నారు. వీరిలో ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌కు చెందిన ఓ వివాహిత(35) తన భర్తతో విడిపోయి కూతురు, బంధువుతో కలిసి ఇక్కడకు వచ్చింది. ఈనేపథ్యాన ఫిబ్రవరి ఒకటి అర్ధరాత్రి సమయాన పక్కనే నివసించే ఒరిస్సాకు చెందిన ఘన్శ్యామ్, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన చండీమల్, సోన్వాని అనే వ్యక్తులు మద్యం మత్తులో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డారు. దీనిపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు సీఐ తెలిపారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు గడువు పెంచాలి

ఖమ్మం సహకారనగర్: వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటర్ల నమోదు గడువు తేదీని పొడిగించాలని తెలంగాణ ప్రైవేట్ జూనియర్ లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్(టీపీజేఎల్‌ఏ) రాష్ట్ర అధ్యక్షుడు పర్సా రమేశ్ కోరారు. ఈ మేరకు సోమవారం సంఘం కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు మల్లేశ్, మాధవరావు, ప్రభు చౌదరి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి పనులను అడ్డుకున్న రైతు



నేలకొండపల్లిలో సర్వే చేస్తున్న అధికారులు

నేలకొండపల్లి: కోదాడ-కురవి జాతీయ రహదారి నిర్మాణానికి సంబంధించి రైతుల వద్ద నుంచి పొలాలు తీసుకుంటున్న సమయాన ఓ రైతు తన పొలాన్ని ఎక్కువగా తీసుకున్నారని పనులను అడ్డుకున్నారు. వివరాల్లోకి వెళితే.. నేలకొండపల్లికి చెందిన రైతు పిట్టల వెంకన్నకు 1.14 కుంటల భూమి ఉంది. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా తనకు చెందిన 5 కుంటల భూమిని అధికారులు తీసుకుని డబ్బులు చెల్లించారు. కానీ కొలతల సమయాన దాదాపు 10 కుంటల భూమిని తీసుకోవడంతో ఆగ్రహించిన వెంకన్న తన భూమి ఇచ్చే వరకు పనులు చేయనీయమని పనులు అడ్డుకున్నారు. దీంతో ఆ ప్రాంతం వరకు పనులు నిలిచిపోయాయి. జిల్లా, మండల అధికారులు చొరవ తీసుకుని సదరు రైతును ఒప్పించినా అంగీకరించలేదు. పూర్తి స్థాయిలో సర్వే చేసే వరకూ పనులు చేసేది లేదని రైతు ఆందోళనకు దిగారు. ఈ మేరకు సోమవారం జిల్లా సర్వే అధికారి శ్రీనివాసరావు సర్వే చేపట్టారు. తనకున్న పట్టాదారు పాస్ పుస్తకం మేరకు తన భూమిని చూపాలని రైతు పట్టుబట్టారు. ఈ కార్యక్రమంలో నేలకొండపల్లి మాజీ సర్పంచ్ వంగవీటి నాగేశ్వరరావు, కుక్కల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

బ్యాండ్ వాయిద్య కళాకారులకు సన్మానం

ఖమ్మంరూరల్: జిల్లా బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం ఆధ్వర్యాన పూర్వ వాయిద్య కళాకారులకు సోమవారం మండలంలోని రెడ్డిపల్లిలో సన్మానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షేక్.మదార్‌సాహెబ్, సురభి నారాయణ, గడ్డం సుక్కయ్యలను ఘనంగా సన్మానించారు. అనంతరం సంఘం జిల్లా నాయకులు షేక్.సోందుసాహెబ్ మాట్లాడుతూ.. పేద కళాకారులకు తమ సంఘం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు.

పంచాయతీ పాలకవర్గానికి ఘన సన్మానం

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెం పంచాయతీ తాజా మాజీ పాలకవర్గానికి సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. గ్రామసర్పంచ్ గుడిపుడి శారదరామారావు దంపతులు, ఉపసర్పంచ్ కుందే సాహెబ్, వార్డుసభ్యులను సన్మానించి.. పాలకవర్గం గ్రామాభివృద్ధిలో చేసిన కృషి కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, కార్యదర్శి శ్రీనివాస్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులను నిరసిస్తూ ప్రజాపంథా ధర్నా

తిరుమలాయపాలెం/ఖమ్మంమయూరిసెంటర్/నేలకొండపల్లి/రఘునాథపాలెం/ఖమ్మంరూరల్: సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకులు సీ.వై. పుల్లయ్య, ఆవుల అశోక్, తిమ్మిడి హనుమంతరావు, సునావత్ శ్రీను, గడ్డం లక్ష్మయ్యలపై కేసు బనాయించి జైలుకు పంపడాన్ని నిరసిస్తూ ఆ పార్టీ నాయకులు ఆయా మండల కేంద్రంలో సోమవారం ధర్నా నిర్వహించి దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈనేపథ్యాన తిరుమలాపాలెంలో నిరసన, ఖమ్మం నగరంలోని బైపాస్, నేలకొండపల్లి, రఘునాథపాలెం మండలం మంచుకొండ, ఖమ్మంరూరల్ మండలం ఎంవెంకటాయపాలెంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. పార్టీ నాయకులపై పెట్టిన కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ జిల్లా కార్యదర్శి గోకినేపల్లి వెంకటేశ్వరరావు, పార్టీ జిల్లా నాయకులు కమ్మకోమటి నాగేశ్వరరావు, ఆవుల మంగతాయి, ఇఫ్టూ పాలేరు డివిజన్ కార్యదర్శి పగిడికత్తుల రామదాసు, రఘునాథపాలెం మండల కార్యదర్శి కేలోతు లక్ష్మణ్, ప్రజాపంథా పాలేరు డివిజన్ కార్యదర్శి బందెల వెంకటయ్య, పార్టీ తిరుమలాయపాలెం మండల కార్యదర్శి సోమనపల్లి వెంకటేశ్వర్లు, పార్టీ నాయకులు వెంకటస్వామి, బానోత్ శంకర్, జి.రామయ్య, శిరోమణి, ఝాన్సీ, కె.శ్రీనివాస్, శివలింగం, చిర్రా భిక్షం, పగిడికత్తుల నాగేశ్వరరావు, ధరావత్ లక్ష్మణ్ , కేళోతు పాపారావు, మేక రామనాథం, జర్పలా దేవల, మలీదు నాగేశ్వరరావు, రెంటాల యాదగిరి, కర్రా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నెంబర్లకు ఉదయం 7-00 గం॥ల నుండి రాత్రి 8-00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే చర్యలు తీసుకోబడును.

కె. ప్రదీప్ కుమార్, ACM - 70132 21824 | రమేష్, ACO - 9059115968
ఖమ్మం ఎన్. ఉపేందర్ - 99591 24151 | మధిర వీరబాబు - 98498 64638
పాలేరు ఎం. రామకృష్ణ - 85220 39990 | సత్తుపల్లి జి. బాబు - 79979 58225
వైరా ఐ. రాందాస్ - 98898 81843 | టోల్‌ఫ్రీ నెం. : 1800 270 1083

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
Land Line : 08742-282823 / 24

మీరు సాక్షిలో వివాహ, జన్మదిన, పదవీ విరమణ, విదేశీ పర్యటన, స్వదేశాగమనం, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు, మీ ఆత్మీయులకు శ్రద్ధాంజలి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, బహిరంగ ప్రకటనలు, అతి తక్కువ ఖర్చుతో కొండత స్పందన లభించే క్లాసిఫైడ్ యాడ్స్ ఇవ్వదలచినచో మీరు సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు : ఎన్. నాగశేషు, యాడ్స్ మేనేజర్- 99122 20600

ఎన్. శేషయ్య - 99121 99148
జి. నర్సింహారెడ్డి - 97054 44181
ఎస్.కె. పాషా - 97054 44182
పి. నందకుమార్ - 90102 99957